**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com


**ప్రచురణార్థం/ ప్రసారార్థం :** **విజయవాడ,**

**తేది : 08 ఫిబ్రవరి, 2022.**

కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలు ఆడలేక మద్దెల ఓడు అన్నట్లుగా ఉన్నాయి. ఒప్పందంపై అసంతృప్తిగా ఉన్న ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించలేక కమ్యూనిస్టులపై దాడికి దిగడం అన్యాయమని సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. పశ్చిమ గోదావరి జిల్లా బుట్టాయిగూడెంలో ఈ రోజు విలేఖరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి దిగజారి అబద్ధాలతో కమ్యూనిస్టులపై దాడి చేయడం తగదని హితవు పలికారు. గతంలో తెలుగుదేశం వారు కమ్యూనిస్టులపై సంధించిన బాణాలనే వారి అంబుల పొది నుండి తీసుకొని దాడికి దిగడం హేయమన్నారు. కమ్యూనిస్టులు రెచ్చగొడితే ఎవరూ రెచ్చిపోరు. ఉద్యోగులు, కార్మికులు, ఉపాధ్యాయులు, రైతులు, కూలీలు ఎవరు న్యాయమైన కోర్కెల కోసం పోరాడినా మద్ధతు ఇవ్వడం, సంఘీభావం ప్రకటించడం కమ్యూనిస్టుల విధి అని ఆయన అన్నారు.

ఉపాధ్యాయ సంఘాలు ఒప్పందాన్ని సంతోషంగా అంగీకరించి బయటకొచ్చి మాట మార్చారని ముఖ్యమంత్రి ఆరోపించడం అన్యాయం. ఆ రోజు రాత్రి ప్రెస్ కాన్ఫరెన్స్‌లో వారు లేరనేది వాస్తవం. ఫిట్‌మెంట్‌పై భిన్నాభిప్రాయంతో వారు వెళ్ళిపోయారని జెఏసి నాయకుడు బండి శ్రీనివాసరావు చెప్పిన విషయం లైవ్‌లో రికార్డయింది. ఒకసారి వాటిని పరిశీలించి మాట్లాడాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు.

'కరోనాతో బడుల్లేక పిల్లల చదువు దెబ్బతిన్నదని చెప్పిన మాట వాస్తవం. కాని కరోనా సమయంలో పిల్లలు లేకపోయినా బడులకు పోయి విధులు నిర్వహించిన ఘనత ఉపాధ్యాయులదని ఆయన మరిచిపోయినట్లున్నారు. కరోనాలో విధులకు హాజరై 900 మందికి పైగా ఉపాధ్యాయులు చనిపోతే కనీసం ముఖ్యమంత్రి సానుభూతి చూపలేదు. సహాయం చేయలేదు. ఇదేనా మానవత్వం' అని ఆయన ప్రశ్నించారు.

మాట తప్పను, మడమ తిప్పను అన్న ముఖ్యమంత్రి గారు సిపిఎస్‌పై మాట తప్పలేదా? కనీసం దాన్ని గురించి ప్రస్తావన కూడా చేయలేదు. అంతా సంతృప్తికరంగా ఉన్నారన్న ముఖ్యమంత్రి, ఆందోళనపై ఇన్ని రోజులు మాట్లాడకుండా ఇప్పుడెందుకు బయటికొచ్చి కమ్యూనిస్టులపై, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలపై దాడి చేస్తున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు.

కేరళలో వామపక్షాలు ఏం చేశాయని సజ్జల రామకృష్ణ రెడ్డి ప్రశ్నిస్తున్నారు. అక్కడ పిఆర్‌సి నివేదికను పారదర్శకంగా బయటపెట్టి ఆ ప్రాతిపదికపై ఉద్యోగ సంఘాలతో చర్చించి సామరస్యపూర్వకంగా ఒక ఒప్పందానికి వచ్చారు. అక్కడ ఆందోళనా లేదు. నిర్బంధమూ లేదు. కాని ఇక్కడ అందుకు భిన్నంగా అశుతోష్ మిశ్రా నివేదికను ఇప్పటికీ బయట పెట్టలేదు. దాపరికంతో వ్యవహరిస్తున్నారు. ఉపాధ్యాయ సంఘాలు చెప్పే దాన్ని వినడానికి కూడా ముఖ్యమంత్రి సిద్ధపడలేదు. ఇదేనా పద్ధతి అని శ్రీనివాసరావు ప్రశ్నించారు.

కమ్యూనిస్టులపై దాడి చేయడం మానుకొని మిగిలి ఉన్న ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలపై చర్చించి ఒక పరిష్కారానికి రావాలని ఆయన సూచించారు.

**(జె.ప్రభాకర్)**
ఆఫీసు కార్యదర్శి